రేవంత్ ప్రోత్సాహంతోనే దాడులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యేపై మరో ఎమ్మెల్యే దాడి కాంగ్రెస్ సంస్కృతి
- స్వప్రయోజన రాజకీయాలు.. అక్రమ అరెస్టులు..
- గాడి తప్పిన ప్రజా సంక్షేమం.. హైడ్రాతో డ్రామా
- ప్రజాపాలన కాదు. కాంగ్రెస్ స్కాముల పాలన..
- 30 శాతం మాత్రమే రుణమాఫీ.. రైతు భరోసా ఏది..?
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబర్ 14 : సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతోనే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యేపై మరో ఎమ్మెల్యే దాడికి పాల్పడటం గతంలో లేదని, కాంగ్రెస్‌తోనే సంస్కృతి ఆరంభమైనట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే స్థానిక సంతబజార్‌లోని వినాయక మండపాన్ని సందర్శించి వినాయకుడిని దర్శించుకున్నారు. అనంతరం కౌన్సిలర్ మధుసూధన్‌రావు యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే గాంధీ దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసినట్లుగా ఉందని ఆరోపించారు. దాడులపై ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావును అరెస్టు చేయడం, అదేవిధంగా అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను అరెస్టు చేసి ఆయా పోలీస్టేషన్‌లకు తరలించి ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి ఏమీ ఎరగనట్లుగా ప్రవర్తించడాన్ని బట్టి చూస్తే.. ఆయన కనుసన్నల్లోనే ఇటువంటి అరాచకాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నదన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజా పాలన గాడి తప్పిందని, ప్రజలకు అందాల్సిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రజలు అందుకోలేకపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే స్కాములు, గుండాయిజం వంటి వాటికి పెట్టింది పేరుగా వర్ణించారు. రైతు భరోసా రూ.15వేలు, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షలు ఇస్తామని విస్మరించారన్నారు. హైడ్రా సాకుతో కనీసం నోటీసులు ఇవ్వకుండా, తలదాచుకునేందుకు చోటు ఇవ్వకుండా ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చి పేదలను రోడ్డున పడేస్తున్నట్లు పేర్కొన్నారు. రుణ మాఫీ కేవలం 30 శాతం మందికి అందజేశారని పేర్కొన్నారు.

ఫార్మా సిటీ పేరుతో కొడంగల్‌కు పొల్యూషన్ అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని, మిగతా ప్రాంతాలవారు తిరస్కరిస్తే.. కొడంగల్ ప్రాంత అమాయక ప్రజలను ఆసరాగా తీసుకొని స్వప్రయోజనాల కోసం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు పూనుకొంటున్నట్లు పేర్కొన్నారు. కొడంగల్‌ను అభివృద్ధి చేస్తున్నాననే ముసుగులో పొల్యూషన్ కంపెనీలను అంటగడుతున్నట్లు విమర్శించారు. ఎన్ని ఒడిదొడుకులు, కష్టాలు ఎదురైనా ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ఒప్పుకునేది లేదని, బలవంతంగా అంటగట్టాలని చూస్తే.. పెద్దఎత్తున నిరసనలు తెలియజేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి గత ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులకు టెంకాయలు కొడుతూ, ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పటికీ కొడంగల్ అభివృద్ధికి నోచుకోవడంలేదని, వేల కోట్లు అంటూ పేపర్‌లకే పరిమితం కాబడ్డాయని పనుల ప్రారంభంలో సున్నాగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ మహిపాల్, బొంరాస్‌పేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నవాజొద్దీన్, రమేశ్ బాబు, రాఘవేందర్‌రెడ్డి, పవన్‌కుమార్, బిచ్చప్ప, రాజశేఖర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం

- మంత్రి సీతక్క
- పెద్దఅంబర్‌పేటలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లామా ఇంజినీర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 14: దేశ అభివృద్ధిలో కూలీలతోపాటు రాళ్లు ఎత్తి పనిచేసింది ఇంజినీర్లేనని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకోవాలని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లామా ఇంజినీర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం పెద్దఅంబర్‌పేట లోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సీతక్కతోపాటు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ చీఫ్ ఇంజినీర్ కనకరత్నం తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. దేశ ప్రగతిలో సివిల్ ఇంజినీర్ల పాత్ర గొప్పదన్నారు. శ్రమలో ఉన్న తృప్తి, చెమటోడ్చడంలో ఉన్న ఆరోగ్యం కూర్చుని చేసే పనిలో ఉండదన్నారు. ఆరోగ్యాన్ని మించిన ఆస్తి ఏదీలేదన్నారు. సివిల్ ఇంజినీర్లు లేకుండా దేశం ఈ స్థాయికి వచ్చేదికాదని, ఈ వృత్తిలో ఉన్నందుకు గర్వపడాలని చెప్పారు. రెండు మూడు రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసుకుందామని, సాధ్యమైనంతవరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి సూచించారు. ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌వోడీఈ ప్రెసిడెంట్ శివానంద, ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్‌రాజ్ బోంగ్షి, రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లామా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనుభవంతోనే వృత్తినైపుణ్యం సాధ్యం

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రబీ శంకర్

ఐఐఆర్ఎం స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రబీ శంకర్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 14 : అనుభవంతోనే వృత్తి నైపుణ్యం సాధ్యమని, వృత్తి పట్ల విశ్వాసం, నిబద్ధత, అంకితభావం ఎదుగుదలకు దోహదపడుతుందని భారతీయ రిజర్వ్‌బ్యాంకు డిప్యూటీ గవర్నర్ టి.రబీశంకర్ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని లీ మెరిడీయన్ హోటల్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మెనేజ్‌మెంట్(ఐఐఆర్ఎం) స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. 2022-24 సంవత్సరానికి వివిధ కోర్సుల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు, ఉత్తమ ప్రతిభ కనభరిచిన వారికి బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తరగతి గదుల్లో నేర్చుకున్నంత సులభంగా వృత్తి నైపుణ్యాన్ని సాధించలేమని, కేవలం అనుభవంతోనే అది సాధ్యమవుతుందని అన్నారు. వృత్తి పరంగా ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే సత్ఫలితాలు సాధ్యమవుతామని పేర్కొన్నారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ రాజ్‌కుమార్ సిన్హా, ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ అభిషేక్ కౌర్ ముజుందార్,ప్రముఖులు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్

ఆమనగల్లు, సెప్టెంబర్ 14 : జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో పాఠకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆమనగల్లులో గ్రంథాలయాన్ని శనివారం మనోజ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి అన్ని రకాల రికార్డులు, గ్రంథాలయాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కొలువుల కేంద్రాలుగా మారాయన్నారు. గ్రంథాలయాల్లో కోట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించడంతోపాటు లక్షలాది పుస్తకాలను అందుబాటులో పెట్టారన్నారు. నిరుద్యోగులు కొలువులు కొట్టాలనే లక్ష్యంతో గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారని తెలిపారు. షాబాద్, కొత్తూరులలో గ్రంథాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయని, కొందుర్లు, చేవెళ్ల, వనస్థలిపురం, మాడ్గులలో నూతన గ్రంథాలయ భవనాలు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లావ్యాప్తంగా 10 గ్రంథపాలకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథపాలకుడు సత్యనారాయణ, సిబ్బంది ఖాజాబీ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి విజయలక్ష్మి
- కిషన్‌నగర్‌లో ఆయుష్మాన్ భారత్ తనిఖీ

ఆరోగ్యమేళాలో వైద్య పరీక్షలు చేస్తున్న జిల్లా ఉపవైద్యధికారి విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 14 : రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలను అందించాలని జిల్లా ఉపవైద్యాధికారి విజయలక్ష్మి వైద్యులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్ గ్రామంలో శనివారం వైద్యాధికారి జగదీశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని అమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక అరోగ్య కేంద్రానికి వచ్చేవారికి మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు నెలకు సరిపడా మందులు పంపిణీ చేయాలన్నారు. గ్రామంలో ఉన్నవారందరికీ భారత్ ప్రభుత్వం అందజేస్తున్న ఆయుష్మాన్ భారత్ అభా కార్డులను అందజేయాలన్నారు. ఈ కార్డులు కలిగి ఉంటే ఒక సంవత్సరం వరకు రూ.5లక్షల వరకు ఉచిత బీమా, ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈగలు, దోమలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యమేళాలో 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 33 మందికి అభా కార్డులు క్రియేట్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాభినయం

మాదాపూర్, సెప్టెంబర్ 14: కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి సంకీర్తనలను నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులు తొలుత విష్ణు సహస్రనామ స్తోత్రము, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రం, అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి, అన్నమ గాయత్రి వంటి సంకీర్తనలకు కుమారి తనయ నృత్యార్చన చేయగా.. స్రవంతి ఆర్ట్స్ అకాడమీ శిష్య బృందం తనయ, శ్రీ విద్య, శ్రావ్య, శ్రీనిక, సుధీశ్‌లు మృదంగం, పవన్ కుమార్, శిరీషలు కలిసికట్టుగా సంకీర్తనలకు నృత్యాభినయం చేశారు. అనంతరం కళాకారులను పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

బీసీల ఓట్లతో అధికారంలోకి అగ్రవర్ణాలు

నిరసనలో పాల్గొన్న మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, విద్యార్థులు

- మంత్రి కాకుండానే రేవంత్ సీఎం అయ్యిండు
- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్

కొండాపూర్, సెప్టెంబర్ 14 : ఒక్కసారి కూడా మంత్రి కాకుండా కేవలం నాలుగేండ్లలో ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి అదృష్టవంతుడని, ఇది నేనిప్పటి వరకు చూడలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు అన్నారు. బీసీల ఓట్లతో అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలంటూ శనివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన క్యార్యక్రమానికి మాజీ ఐపీఎస్ పూర్ణ చందర్‌రావు, మాజీ ఏఐఎస్ చిరంజీవులు, స్టూడెంట్స్ నాయకులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసీ కుల గణన చేపట్టి ఆ అదృష్టాన్ని కూడా తమ ఖాతాలో వేసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ఏండ్లుగా దేశాన్ని పాలించి, చేసిందేమీలేదంటూ రాహుల్ గాంధీని ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రశ్నకు సమాధానంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వెంటనే ఓబీసీ కుల గణన చేపట్టి న్యాయం చేయాల్సిందిగా తెలిపారు. హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని మూడు నెలల్లో కుల గణన పూర్తి చేయాలంటూ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. పూర్ణ చందర్‌రావు మాట్లాడుతూ దేశంలో వర్ణ, కుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సగానికి పైగా ఉన్న బీసీలు 50 శాతం రిజర్వేషన్లకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎర్రకుంట సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ఎర్రకుంట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ, సెప్టెంబర్ 14 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి వివిధ కాలనీల వాసులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎర్రకుంటపై వెలసిన డబ్బాలను తొలగించడంతో పాటు కుంట సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాయకులలో విభేదాలు...

బండ్లగూడ జాగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి విషయమై కాంగ్రెస్ నాయకుల్లో విభేదాలు పోడసూపుతున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు ఇప్పటికిప్పుడూ అభివృద్ధిపనులు జరిగితే నూనతంగా పార్టీలో చేరిన వారికి ప్రఖ్యాతి వస్తుందిని అభివృద్ధిని విస్మరిస్తుండగా నూతనంగా చేరిన వారు మాత్రం కాలనీ వాసులతో ఎమ్మెల్యేను కలిసి వెంటనే పనులను జరిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో కాంగ్రెస్ పాత కొత్త నాయకులలో విబేధాలు అంతర్గంగా కోనసాగుతున్నట్లు తెలుస్తుంది. అభివృద్ధి పనులు జరిగితే వారికి ఎక్కడ పేరు వస్తుందోనని పాత వారు మదనపడుతుండగా కొత్తగా చేరిన వారు మాత్రం అడుగు ముందుకేసి అభివృద్ధి పనులు జరిపించి ప్రజల మన్నలను పొందాలని చూస్తున్నారు. దీంతో విభేదాలు పొడచూపుతున్నాయని కార్యకర్తలు మదన పడుతున్నారు.

ఉత్సాహంగా ఓనం సంబురాలు

కేరళ సంస్కృతి, సంప్రదాయ పండుగ ఓనం వేడుకలను శనివారం గచ్చిబౌలి కాంటినెంటల్ హాస్పటల్‌లో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన హాస్పటల్ సిబ్బంది తమదైన శైలిలో ఎంతో ఉత్సాహంగా సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఓనం సంబురాలు జరుపుకున్నారు. కాంటినెంటల్ సీఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రఘు ఎన్ రెడ్డిలతో పాటు హాస్పటల్ వైద్యులు, నర్సులు, సిబ్బంది, ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 14

హిందీ పాత్రికేయులకు సమాన ప్రాతినిధ్యం

జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 14 : హిందీ పాత్రికేయులకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని, భాషా ప్రాతిపదికన వివక్ష ఉండదని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కొత్తతరం పిల్లలు అందరూ హిందీ మాట్లాడుతారని అన్నారు. పాత్రికేయులను భాషా ప్రాతిపదికన చూడమని , భవిష్యత్‌లో అలాంటి సంఘటనలు జరిగితే తానే ముందుంటానని చెప్పారు. హిందీ పాత్రికేయులకు ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్ , మెడికల్ ఇన్సూరెన్స్ అందేటట్లు చూసే బాధ్యత తనదేనన్నారు. త్వరలో మరో 3వేల మందికి పైగా హైదరాబాద్ జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ఇస్తామంటూ సీఎం ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ, తెలంగాణ హిందీ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్.కుమార్ దక్షిణ్ సమాచార్ పత్రిక ఎడిటర్ నీరజ్‌కుమార్, వికాస్ శుక్లా, ఎం.ఎ సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కొండాపూర్, సెప్టెంబర్ 14 : హిందీ భాషా దివస్‌ను పురస్కరించుకుని శనివారం కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో హిందీ భాష దివస్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై హిందీ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హిందీ గొప్పదనాన్ని వివరిస్తూ నృత్యరూపకంలో కథలు, భాష గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్' ప్రోగ్రాం

కొండాపూర్, సెప్టెంబర్ 14 : నేటి యువతలో సామాజిక స్పృహను నింపుతూ, దేశ రాజకీయాలు, సమాజ సేవలో వారి ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ది డెమోక్రటిక్ సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్‌లో 'యంగ్ లీడర్స్ ఫర్ సోషల్ ఛేంజ్ ప్రోగ్రాం'ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవెన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహను పెంపొందించేలా విద్యా విధానాల్లో మార్పు రావాలన్నారు. ఎంపికైన పలువురు విద్యార్థులకు దేశ పార్లమెంట్‌తో పాటు పలువురు ఎంపీలతో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ చైతన్య ఎంఆర్ఎస్‌కే తెలిపారు.



మహాగణపతి భక్తజనం

ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం 6గంటల నుంచే భక్తులు తరలిరాగా, సాయంత్రానికి రెట్టింపు సంఖ్యలో వచ్చారు. ఖైరతాబాద్ ఎంఎంటీఎస్, మెట్రో స్టేషన్, బస్టాండ్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి వరకు సుమారు 4లక్షలపైగా భక్తులు దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. - ఖైరతాబాద్, సెప్టెంబర్ 14